కథానిక

# "అదృష్టవంతురాలు సౌదామిని"

అమరేంద్ర

గుండెలమీదినుంచి ఒక్కసారిగా కొండంత బరువు దింపినట్లుంది. "అమ్మయ్యా!" అని సంతృప్తితో సంతోషంతో రామనాథం ఒక్కనిట్టూర్పు విడిచాడు. అతనికి తెలియకుండానే ఆనందంతో కన్నీళ్లు చిందినయ్. ఇన్నాళ్ళకి అతన్ని పీడిస్తున్న ముఖ్యసమస్య పరిష్కారం అయింది. ఇన్నాళ్ళకి అతని మనస్సుకి విశ్రాంతి దొరికింది. దైవికంగా తన కూతురు సౌదామినికి మంచి సంబంధం కుదిరింది. జిల్లాబోర్డు బడి పంతులుగా నెలకి ఎనభై రూపాయలు తెచ్చుకునే తను ఈ గడ్డురోజుల్లో కూతురికి ఎల్లా పెళ్ళి చేస్తానా అని బెంగపెట్టుకుని ఆ దిగులుతో దిగనాసిల్లి చిక్కి సగమైపోయాడు. కాని ఆ సమస్య అనుకోనివిధంగా అద్భుతంగా పరిష్కారం అయిపోయింది.

సౌదామిని నిజంగా మెరుపుతీగే! ఆమెని చూడగానే ఒక లక్షాధికారి కొడుకు ముగ్ధుడై పోయి మరుక్షణంలో అంగీకరించేశాడు. అంతవరకూ పదివేల కట్నం కావాలని భీష్మించుక్కూచున్న పెళ్ళికొడుకు కట్నం లేకపోయినా సరే సౌదామినిని తప్ప ఇంకొకర్ని పెళ్ళాడనని ఖచ్చితంగా తల్లిదండ్రులకి చెప్పేశాడు. వాళ్ళు కూడా పిల్ల బాగుందని మురిసిపోయారు. తమ హోదాను నిలుపుకునేందుకు నామమాత్రంగా వెయ్యిరూపాయల కట్నం ఇస్తే చాలన్నారు. అటువంటి సంబంధం దొరకటం కూతురు అదృష్టమని తాకట్టుపెట్టి వెయ్యి రూపాయల కట్నం ఇచ్చి రామనాథం వైభవోపేతంగా పెళ్ళి చేశాడు. ఆయన తాహతుకి వెయ్యి రూపాయలు పెగిల్చి తేవటం సామాన్యంకాదు. కాని వియ్యాలవారి దృష్టిలో మట్టుకు వెయ్యి రూపాయలు చిల్లికానీతో సమానం!

పెళ్ళినాటికే వయసువచ్చిన పిల్ల కావటం వల్ల సౌదామిని కొద్దిరోజుల్లోనే కాపరానికి అత్తవారింటికి వెళ్ళిపోయింది. అత్తవారింట్లో అడుగుపెట్టగానే సౌదామినికి ఏదో కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లనిపించింది. ఇన్నాళ్ళూ పుట్టింట్లో నిత్యదరిద్రం అనుభవించి వచ్చిన సౌదామిని అత్తవారింట్లో భోగభాగ్యాలు చూసి ఆశ్చర్యపోయింది. సావిడినిండా గేదెలూ, ఆవులూ, ఎడ్లూ, బళ్ళూ, నౌకర్లూ, దొడ్డినిండా గాదెలూ, తోటలూ. ఇన్నాళ్ళనించీ మూడు గదుల ఇరుకు అద్దెకొంపలో పెరిగివచ్చిన సౌదామిని ఒక్కసారిగా మూడంతస్తుల మేడలోకి వచ్చింది. ఇంతయింట్లోనూ తను కాక అత్తమామలూ, భర్తా ముగ్గురే మనుష్యులు! కొత్తలో బిక్కుబిక్కుమనిపించింది. కాని త్వరలోనే ఆ బెరుకూ, ఆ బెంగా పోయి, ఆ సామ్రాజ్యానికంతకీ తనే రాణిని అనే ధిలాసా బలిసింది. ఆ యింట్లో తనమాటకి ఎదురు లేదు. భర్త తన సౌందర్యానికి దాసుడైపోయి తనని ఆలయంలోని దేవీమూర్తిని కొలిచినట్లు ఆరాధిస్తాడు. అత్తమామలు కూడా ఆడపిల్లలు లేని కారణాన తనని ఎంతో ఆప్యాయంగా ఆదరిస్తారు. నౌకర్లూ చాకర్లూ అనుక్షణమూ "దొరసానిగారూ" అంటూ తన కనుసన్నలలో మెలుగుతూ వుంటారు. ఊరివాళ్ళందరూ తన అందాన్నీ ఐశ్వర్యాన్నీ చూసి ఎంతో గొప్పగా చెప్పుకుంటూ వుంటారు. భర్త రామారావు తనని ఎప్పుడూ "రాణీ!" అని సంబోధిస్తూ వుంటాడు. ఈ సంబోధనని బట్టి అతనిక్కొంచెం భావకవిత్వపు పైత్యం వుందని అనుకోవచ్చును. అస్తమానమూ మేడమీద గదిలో కూచుని నందనవనాలనీ మందాకినీ తరంగాలనీ బృందావనంలో రాధాకృష్ణులనీ గురించి కలలు కంటూ కావ్యాలు అల్లుతూ వుంటాడు. అవన్నీ సౌదామినికి వినిపిస్తాడు. తనకి అర్థం కాకపోయినా సౌదామిని చాలా అద్భుతంగా వున్నయ్యని

పొగడుతుంది. ఆమె పగలంతా భర్తకు ఎదురుగా కూచుని అతని కావ్యాలు వింటూ, కుట్టుపనులతోనూ అల్లికపనులతోనూ పొద్దుపుచ్చుతూ వుంటుంది. ఆమె చిటికెన వేలు కూడా వొంచవలసిన అవసరం లేదు. అరికాలు నేలమీద పెడితే ఆరిగిపోతుందేమో అన్నట్టు చూస్తారు అత్తమామలు. ఎండముఖం చూస్తేనే భార్య ముఖకమలం కందిపోతుందేమోనని భయపడుతాడు రామారావు.

ఇటువంటి సుఖమయ జీవితాన్ని సౌదామిని ఇదివరకు కలలోనైనా వూహించలేదు. ఈ సుఖం, ఈ సంతోషం ఒక నిషాలాగా సౌదామిని తలకెక్కినయ్. ఈ పదహారేళ్ళనుంచీ తను ఎరిగున్న జీవితాన్ని ఇట్టే మరిచిపోయింది. ఆ జీవితాన్ని చిరిగిపోయిన చీరెని విడిచినట్టు వొదిలి దూరంగా విసిరి పారేసింది.

ఇప్పుడు తల్లిదండ్రులని గురించి ఆలోచనే సౌదామిని తలలోకి రాదు. వాళ్లు తన యోగక్షేమాలు తెలుసుకోవాలని పరితపిస్తూ ఎన్ని వుత్తరాలు రాసినా తను జవాబు రాయలేదు. వాళ్లెవరు? తనెవరు? వాళ్ళంతా భూతకాలపు భూతాలు. వాళ్లకి తన ప్రస్తుత జీవితంలో కాని, భావిజీవితంలో కాని తావులేదు. వాళ్లకి జాబు రాయటమే సౌదామినికి న్యూనత అనిపిస్తుంది. పుట్టింటికి పోవాలనే తాపత్రయం సౌదామినికే లేనప్పుడు అత్తమామలకీ భర్తకీ అసలే పంపాలని వుండదు. వాళ్ళదృష్టిలో సౌదామిని పిక్కట్టే దేవత, ఆమె తల్లిదండ్రులు ఉత్త పురుగులు! తమ కోడలు వాళ్ళ బీదకొంపకి పోతే తమ మూడంతస్తుల మేడకి ఎంత చిన్నతనం!

కూతురు కబురే తెలియటం లేదని సౌదామిని తల్లి బెంగపెట్టుకుంది. దసరాశెలవల్లో కూతుర్నీ అల్లుణ్ణీ తీసుకువద్దామని రామనాథం బయలుదేరి వెళ్లాడు. సౌదామిని అదృష్టానికి రామనాథం సముద్రంలాగా పొంగిపోయాడు. కాని తనతో వచ్చి నాలుగురోజులపాటు వుండి వెళ్లమంటే సౌదామిని చెప్పిన సమాధానం విని కుంగిపోయాడు. "నేను రాను నాన్నా. ఎందుకు మీరు ఇబ్బంది పడటం, మేము ఇబ్బంది పడటం? ఎందుకొచ్చిందీ? అమ్మా, మీరూ వచ్చి వారం రోజులపాటు ఇక్కడే వుంటే సరిపోతుంది" అంది. ఈ సమాధానం వినేసరికి రామనాథానికి కడుపులో దేవినట్లయిపోయింది. కూతురే ఇల్లా మాట్లాడితే ఇక అల్లుణ్ణి అనవలసిన పనేముంది?

ఆనాడే తిరుగు ప్రయాణంకట్టి వెళ్ళబోయే ముందు కూతురికి ఇంకోసారి చెబుదామని మేడమీదికి వెళ్లాడు. సౌదామిని తెల్లగుడ్డమీద రంగురంగుల దారాలతో నెమిలిబొమ్మ కుడుతోంది. తండ్రి రావటంచూసి కూడా తల పైకి ఎత్తలేదు. "ఒక రెండురోజులపాటువుండి వెళ్దుగాని రా తల్లీ. నీకోసం తమ్ముళ్ళు బెంగ పెట్టుకున్నారు. మీఅమ్మ కూడా కలవరిస్తోంది" అన్నాడు రామనాథం.

"నాకూ వాళ్ళని చూడాలని వుంది నాన్నా. అందుకేగా ఇక్కడికి వస్తే బాగుంటుంది అంటున్నాను. ఇల్లు హాయిగా విశాలంగా వుంటుం నాలుగు గమిడిగేదెల పాలు. అందరం సరదాగా నాలుగురోజులు కలిసివుందాం, మీరంతా ఇక్కడికి రాకూడదా నాన్నా? శెలవలేగా?" అంది సౌదామిని.

ఈసారి రామనాథం తల తిరిగిపోయింది. తను ఏ దివలోకంనుంచో దిగివచ్చిన మనిషిలాగా సౌదామిని మాట్లాడటం విని సహించలేకపోయాడు. కన్న కూతురే తనని ఈవిధంగా అవమానించటం చూసేసరికి అభిమానంతో మగ్గిపోయాడు. "అయితే వెళ్లొస్తానమ్మా. కాస్త వుత్తరమైనా రాస్తూవుండు. బొత్తిగా కబురు తెలియక దిగులు పడుతున్నాం" అని మెట్లుదిగి వెళ్ళిపోయాడు. సౌదామిని తండ్రి వెళ్తున్నా సాగనంపటానికి లేచి గదిబైటికి రాలేదు. ఇంత సేపూ తండ్రిని నిల్చోబెట్టి మాట్లాడిందేకాని ఖాళీ కుర్చీ ఎదురుగావున్నా కూచోమన్న పాపాన పోలేదు.

ఇక ఎన్నటికీ ఆ గడప తొక్కకూడదనే గట్టి నిశ్చయంతో, పుట్టెడు దిగులుతో, రగిలే అభిమానంతో, రామనాథం ఇంటికి తిరిగి వెళ్ళిపోయాడు. తన కన్న కూతురే తనకి ఇంత దూరమైపోతుందనీ, తన కూతురు దృష్టికే తను ఇంత హీన మౌతాననీ ఎన్నడూ అనుకోలేదు. అమ్మాయి రాలేదేం అని భార్య అడిగినప్పుడు "ఎందుకు వొస్తుందీ? అదిఎవరో మనం ఎవరమో? దాని హోదాకు మనం తగుతామా?" అన్నాడు.

ఆడపిల్ల నిచ్చుకున్నవాళ్లు ఒకటే పట్టుమీద వుండటానికి ఎల్లా వీలవుతుంది? కడుపు తీపికొద్దీ అభిమానాన్నికూడా ఒక్కొక్కప్పుడు చంపుకో వలసి వస్తుంది.

సౌదామిని తమ్ముడు సుదర్శనానికి వేసంగి శలవల్లో వొడుగు చెయ్యాలని రామనాథం నిశ్చయించాడు. ఇట్లా శుభకార్యానికి కూతురూ అల్లుడూ రాకపోతే నలుగురికీ నవ్వులాటగా వుంటుంది. అందుకని ఎల్లాగయినా బతిమాలుకుని తీసుకువద్దామని తల్లితండ్రీ బయలుదేరి వెళ్ళారు. అప్పటికి సౌదామిని కాపరానికి వెళ్లి నాలుగేళ్లు గడిచినయ్. ఇంకా బిడ్డా పాపా లేరు. మామగారు కాలం చేయటంవల్ల భర్త రామారావే ఇప్పుడు ఇంటి యజమాని. ఇప్పుడు సౌదామిని ఏకచ్ఛత్రాధిపత్యం వహించి సంసార చక్రాన్నంతన్నీ తన చేతులమీదే తిప్పేస్తున్నది.

తల్లిదండ్రీ ఎంతో బతిమాలుకుంటే కాని సౌదామిని పుట్టింటికి రావటానికి వొప్పుకో లేదు. ఆమెకీ భర్తకీ పక్కింటివారి మేడమీద విడిగా బస యేర్పాటుచేస్తానని రామనాథం హామీ యిచ్చాడు. వాళ్లున్నన్నిరోజులూ వాళ్ళకి వీసంకూడా లోపం రాకుండా అన్ని సౌకర్యాలూ చేస్తానని తల్లి పూచీపడింది. అప్పటికి నసుగుతూ అంగీకరించింది సౌదామిని.

బండీ దిగటంమాత్రం సొంత యింటిముందు దిగి చెల్లెళ్లనీ తమ్ముళ్ళనీ ముక్కున పెట్టుకున్నట్లు, అంటీ ముట్టనట్లు పలకరించి యెకాయెకి తమ ప్రత్యేకమందిరంలోకి వెళ్ళి మకాం పెట్టి కిందికి దిగివస్తే అరిగిపోతున్నట్లుగా కూచుంది. వొడుక్కి వచ్చిన చుట్టాలందరికీ సౌదామిని అతిశయం కంటకంగా తోచింది. "దానికి కళ్లు నెత్తికెక్కినయ్'' అని అంతా వ్యాఖ్యానించారు.

ఎల్లాగో ఒకలాగు వొడుగుచేసేసి రామనాథం వొడ్డునపడ్డాడు. వొచ్చిన చుట్టాలంతా తిరిగి వెళ్లిపోతున్నారు. వాళ్ళందరితోపాటే సౌదామినికూడా ప్రయాణం కట్టింది. ''ఈ సందడి సమయంలో కలిసివున్నట్టే లేదు. నాలుగు రోజులపాటు వుండి వెళ్దువుగాని లేవె' అని బతిమాలింది తల్లి. ససేమిరా అని బయలుదేరింది సౌదామిని. కూతురూ అల్లుడూ వెళ్లిపోతున్నారని చెప్పిహడావిడిగాబజారువెళ్లి రామనాథం పాతిక రూపాయల చీరా, ఇరవైరూపాయల పంచలచాపూ కొనుక్కొని వచ్చి పసుపురాసి కట్టుకో మని అన్నాడు. కాని సౌదామిని తండ్రిముందే వాటిని తిరస్కారంగా లుంగలు చుట్టిపెట్టి అడుగున పారేసి తనకున్న చీరలన్నిటిలోకీ విలువైన సిల్కుచీర సింగారించుకుని బండీ ఎక్కింది. బండీ కదులుతుంటే ''నేనుకూడా వస్తానక్కా'' అంటూ చిట్టిచెల్లాయి సీత వెంటపడింది. సౌదామిని వెనక్కి తిరిగి అయినా చూడకుండా "పోనియ్యి బండీ, చూస్తావేం!" అంది.

బండీ కదిలి కనుమాపుమేర దాటిపోతోంది. రామనాథం, భార్య అక్కడే ప్రతిమల్లాగా నిలబడి దుఃఖంతో అభిమానంతో మగ్గిపోయారు. పట్టలేని కడుపుమంటతో ఇద్దరూ రగిలిపోయారు. ''ఎందుకంట దానికి మనమీద ఇంత శత్రుత్వం?'' అంది తల్లి. ''మంచి సంబంధం కుదిర్చి పెళ్ళి చేసినందుకు! అదేగా మనం చేసిన అపరాధం?'' అన్నాడు రామనాథం ఆవేశంతో వొణుకుతున్న కంఠంతో.

బండీ దూరంలో మాయ మయిపోయింది. అదృష్టవంతురాలు సౌదామిని నిర్భాగ్యులయిన తల్లిదండ్రులకి దూరమైపోయింది-ఎంతో దూరమైపోయింది!

''ఆఁ. యేమిటో? కన్నకడుపు కనక పిచ్చిగా మనం పట్టుకు పాకులాడుతాం. కాని దానికి మనం ఒక లెక్కలోని వాళ్ళం కాదు. అవును, కన్నబిడ్డలకూడా గడ్డి పరకతో సమానం అయిపోయాం'' అని ఆవేదనతో విరక్తితో తల్లి కళ్లు తుడుచుకుంది.

''దానికి మనం గడ్డిపరకలం అయితే అదీ మనకి గడ్డిపరకే! కన్నకూతురైనా ఎవరైనా సరే డబ్బునిబట్టి మనుషులని కొలిచేవాళ్ళని నేను పురుగులకంటే హీనంగా చూస్తాను. ఎవరి గొప్ప వాళ్ళదే'' అని ఆవేశంతో రామనాథం బదులు చెప్పాడు.

బండీ సాగిపోతుంటే రామారావు "నాకిక్కడేం బాగాలేదు రాణీ! ముళ్లమీదున్నట్లుంది." అన్నాడు.

''అవునండీ. ఇకెప్పుడూ వెళ్లొద్దు లెండి. ఇకెప్పుడు మిమ్మల్ని బాధపెట్టను లెండి. నామటుకు నాకు మొఖం మొత్తిపోయింది. ఇంట్లో వెళ్ళి

ఎప్పుడు వాలుతావా అని వుంది" అని సౌదామిని బదులు చెప్పింది.

"అక్కా జట్టుపచ్చి" అంది చెల్లెలు సీత తనని సౌదామిని తీసుకుపోలేదన్న రోషంతో.

"అవునమ్మా పచ్చి కొట్టేద్దాం. పెద్దయితే నువ్వూ ఇంతే చేస్తావా మమ్మల్ని? ఒక అయ్య చేతుల్లో పెట్టేదాకానే అమ్మా నాన్నా. ఆ తరవాత మీరెవరో, మేమెవరో, ఎవరికి వారే యమునాతీరే" అంది మనస్సుని వికలంచేసిన విరక్తితో తల్లి, సీతని చేతుల్లో ఎత్తుకుని. తల్లి మాటలు అర్థం కాక సీత బెదురుచూపుల్తో "అక్కా జట్టుపచ్చి" అని మళ్ళీ బిగ్గరగా అంది.

ఒక్కా_కతరిన్

# పువు బోండ్లు కటారి కత్తియల్

## "జయంతి"

"వసుంధరా! నీకీ వుత్తరం ఎవరు రాస్తున్నారో తెలుసనుకుంటాను. 'ఇంత సాహసించి రాస్తాడా' అని నువ్వనుకోవచ్చు. నేను గనక అలా రాయకపోతే కేవలం కృత్రిమము, అసహజము అయిన స్వభావం గలవాణ్ణి అవుతాను. నేనీ వుత్తరం ఎందుకు రాస్తున్నానో నీకు తెలియదు. కొంత తెలిసినా తెలియవలసినంతగా తెలియదు. ఈ వుత్తరం నీకు వింత సంఘటనల్లో రాస్తున్నాను. హతాశుడినై మరణశయ్యమీద నుండి రాస్తున్నాను. నాచుట్టూ కట్టబడ్డ గోరీలో కూచుని రాస్తున్నాను. ఏది యేమైనాసరే రాస్తున్నాను. జరగవలసిన సంఘర్షణ సందర్భాలు జరిగి తీరుతాయి. మానవు. వాటిని మళ్ళించే శక్తి మన చేతుల్లో లేదు. అందుచేతనే యీ వుత్తరం రాసేస్తున్నాను.

"నీకు తెలుసు వసుంధరా! నే నీ యింటిలో అడుగు పెట్టింది మొదలు నువ్వు నాకేసి చూస్తున్నావు. విడవకుండా చూస్తున్నావు. కోమలంగా వింతగా, అందంగా చూస్తున్నావు. నిశితంగా, గాఢంగా చూస్తున్నావు. వెనకవాటుగా ప్రక్కవాటుగా చూస్తున్నావు. ఈ సంగతి కాదనలేవు గదా! నువ్వు చూసిన వెంటనే, వెను వెంటనే నేనూ చూస్తున్నాను. అంత కోమలంగావుండవు నా చూపులు. అంత తీక్షణంగా వుండవు. అయినా చూస్తున్నాను. వెర్రిగా, దీనంగా, ప్రాధేయపడుతున్నట్టు... అంతే? అంతకు మించి చూడలేను కూడాను!

"నాకు తారతమ్యాలు తెలియవని నువ్వనుకో నక్కరలేదు. బాగా తెలియకపోవచ్చు. కాని, నీకన్న ఎక్కువ తెలుసు. నీకే లోటూ లేదని, నీ భర్తకు నువ్వు చెప్పినదే వేదమని తెలుసు. మీకు చాలా ధనముందని నాకు తెలుసు. అలాంటి నువ్వు వేరే దృష్టితో ఎవళ్ళనీ చూడనక్కరలేదనికూడా నే నెరుగుదును. కాని, వసుంధరా! నీ చూపులు నా కర్థం కావడంలేదు. నీ కన్నుల లోతు నేను కనుక్కోలేను. వాటి అడుగున వున్నది ముత్యాలో, ముగ్గురాళ్లో నాకు తెలియదు. నాకు తెలిసినదల్లా నువ్వు చూస్తున్నావనీ, ఎందుకో నాకేసి చూస్తున్నావనీ..."

"వసంత అందాలరాణి అనడంలో సందేహం లేదు. ఆమెలో సౌందర్య లక్షణాలు లక్ష లున్నాయి. సహజ సంస్కారంతో గుండె నిబ్బరంగల మనిషి. ఆమె గుణగుణాలు రత్నాల రాసులు. అయినా, అలాంటి భార్య సమీపంలో వుండే, నేను నీకేసి చూస్తున్నానంటే కారణం ఏమైవుంటుంది? ఆ కారణమే నిన్నూ నాకేసి చూడ మంటోందేమో!"

"గలగలలాడే నీ గాజులచప్పుడువిని నా రక్తం పొంగుతుంది. మందంగా నీరసంగా వున్నప్పుడు కోకిలారావంలాంటి నీగొంతు వినిపించి నాలో నూతన చైతన్యాన్ని కలిగిస్తుంది. వెర్రిగా విచారంగా వున్నప్పుడు నీ పకపకలువచ్చి నిరుత్సాహాన్ని దూరంగా తరిమేస్తాయి. వీటన్నిటికీ చాలా కృతజ్ఞుణ్ణి."

"కాని, ఒక్కొక్కరోజు గడుస్తున్న కొద్దీ నాలో రణరంగం ఎక్కువవుతూంది. నా శరీరంలో అణువూ అణువూ పోట్లాడుకొంటున్నాయి. దేహం హారతి కర్పూరంలాగ క్షణక్షణం హరించి